

ఎల్‌ఆర్‌ఎస్..ఎందాకా..?

గత ప్రభుత్వంలో స్వీకరించిన ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని ఇటీవల ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. - 8లో▸



కలిసికట్టుగా పనిచేద్దాం

అందరం కలిసికట్టుగా పనిచేసి ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేసుకుందామని మంత్రి కొండా సురేఖ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0^0 / 25.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతులు రశీదు తీసుకోవాలి



పలిమెల: రైతులు విత్తనాల కొనుగోలు చేసేటప్పుడు దుకాణాదారుల వద్ద తప్పకుండా బిల్లు తీసుకోవాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేసి దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు విత్తనాలు కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తపై పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన ప్యాకెట్లు, రశీదులు పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ముంజ మహేష్, వ్యవసాయ విస్తరణ అధికారి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

- కాళేశ్వరంలో అధ్యాపకుల విస్తృత ప్రచారం



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులను చేర్పించాలని గ్రామాల్లో అధ్యాపకులు విస్తృతంగా ప్రచారం చేశారు. బుధవారం కాళేశ్వరం, పూస్కుపల్లి, మద్దులపల్లి, కుదురుపల్లిలో అధ్యాపకులు వంగపల్లి పరశురాములు (కామర్స్), కాంపెల్లి మున్నయ్య (ఇంగ్లిష్), శాఖమూరి రవీందర్ అధ్యాపకుల బృందం ఆయా గ్రామాల్లో పర్యటించి ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులను కలిసి అవగాహన కల్పించారు. దోస్త్ రెండో విడత ప్రక్రియలో మహదేవపూర్ డిగ్రీ కాలేజీలో చేర్పించడానికి అవగాహన కల్పించారు. డిగ్రీ కాలేజీలో ఉన్న కోర్సులు అధ్యాపకులు వివరించారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో జిల్లా కేంద్రంలో సీపీఎం పార్టీ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం బందు సాయిలు మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లా నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని, రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతుల్లో కేడర్‌ను ఉత్తేజపరిచి శిక్షణ ఇచ్చి రాబోయే భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వెలిశెట్టి రాజయ్య, నాయకులు రమేష్, శేఖర్, మహేందర్, గోమాత తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేల చెక్కు అందజేత




ఎస్‌ఎస్‌తాడ్వాయి: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్ సంకె పల్లవి చదువుకు రూ.50వేల చెక్కును ఆర్థికం సాయంగా బుధవారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే..మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన సంకె పల్లవి ఇటీవల బాంబే ఐఐటీలో ఎంటెక్ సీటు సాధించింది. ఈ క్రమంలో సాక్షిలో తన చదువుకు దాతలు సాయం అందించాలని కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన దాతలు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. హెల్పింగ్ హాండ్స్ సభ్యుడు, డిప్యూటీ తహసీల్దార్ కిశోర్ తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్‌ల దృష్టికి తీసుకెళ్లి ఆర్థికసాయం అందించాలని కోరగా వారు స్పందించారు. ఈ సందర్భంగా బుధవారం హైదారాబాద్‌లోని తెలంగాణ సచివాలయం ఎదుట హెల్పింగ్ హాండ్స్ సంఘం సభ్యుల సమక్షంలో సంకె పల్లవిని శాలువాతో సన్మానించి రూ. 50వేల చెక్కును ఆర్థికసాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవేందర్, కోశాధికారి గుణవంత్, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షులు రమేష్, గంగ, లక్ష్మి, సోమన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

విత్తన ఎంపిక కీలకం

భూమి స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాలి

- పల్లి పంట సాగు చేస్తే లాభదాయకం
- రైతుల సందేహాలను తీర్చిన డీఏఓ విజయ్‌భాస్కర్
- 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమానికి మంచి స్పందన





భూపాలపల్లి రూరల్: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. ఇప్పుడు జాగ్రత్తలు తీసుకొని మంచి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. భూమి స్వభావాన్ని బట్టి పంటలు వేసుకోవాలి. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్ రైతులకు సూచించారు. బుధవారం సాక్షి నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి రైతులు స్పందించారు. తమ సందేహాలు, సమస్యలను డీఏఓకు ఫోన్‌లో వివరించారు. దీనికి స్పందించిన ఆయన సమాధానాలు ఇచ్చారు. పలు సలహాలు, సూచనలు చేశారు.

రైతులు: డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలు అందుబాటులో లేవు. విత్తనాలను అందుబాటులో ఉంచాలి?

(దాసారపు సదానందం, గర్మిళ్లపల్లి, టేకుమట్ల, వేమునూరి రమేష్, కొత్తపల్లి, కాటారం)

డీఏఓ: పత్తి విత్తనాలు 126 కంపెనీలకు చెందినవి ఉన్నాయి. చాలా మంది రైతులు సాంకేత్ విత్తనాలు కావాలని అడుగుతున్నట్లు సమాచారం. జిల్లాకు 3 వేల విత్తన ప్యాకెట్లు రావాల్సి ఉండగా కేవలం 500 ప్యాకెట్లు వచ్చాయి. అందులో భూపాలపల్లిలో 320, కాటారంలో 180 ప్యాకెట్‌లు సరఫరా చేశాం. మిగతా ప్యాకెట్‌లు రాగానే మండలాల వారీగా సరఫరా అయ్యే విధంగా చూస్తాం. మధ్యస్థ రకాలు 7878, రాశి, చంద్రగోల్డ్, అఖండ, ముద్ర, సిద్ధ, రణధీర్ తదితర రకాలు ఉన్నాయి. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తనిఖీలు చేపడుతున్నాం. పెద్దవానలు పడిన తర్వాతనే పత్తి విత్తనాలు విత్తుకోవాలి.

రైతు : పంటల సాగుపై సలహాలు, సూచనలు చేయడం లేదు.

(నంగె రవి, ఎంపీటీసీ, టేకుమట్ల)

డీఏఓ: భూమి భౌతిక స్థితి ఆధారంగా పంటలు సాగు చేయాలి. వరి పొలంలో కోసిన గడ్డిని కాలకుండా పొలంలోనే మురగనీయాలి. అనంతరం దున్ని సాగు చేయాలి. దీంతో తెగుళ్లు రాకుండా అరికట్టవచ్చు.

రైతు: ఎలాంటి వరి విత్తనాలు వేసుకోవాలి?

(కంకనాల బాపు, కాళేశ్వరం, మహదేవ్‌పూర్)

డీఏఓ: వరిలో సన్న రకాలైన ఎంటీయూ 1271, జై శ్రీరాం హెచ్ఎంటీ, కావేరీ చింటు, తదితర రకాల విత్తనాలు వేసుకోవచ్చు. వరి నాట్లు వేసుకోవడం ఆలస్య మైతే తెలంగాణ సోనా వేసుకోవడం మంచిది. అదేవిధంగా దొడ్డు రకాలైతే కేఎస్ఎం 118 లేదా కేఎస్ఎం 1636 రకాలను వేసుకోవచ్చు.

రైతు: పత్తి విత్తనాలు విత్తాను. నీళ్లు లేవు ఎండిపోతుంది. ఏమి చేయాలి?

(చెరుకు ఐలుస్వామి, బుద్దారం, గణపురం)

డీఏఓ: భూమి సుమారుగా 30, 40 సెంటీమీటర్ల లోతు తడిసిన తర్వాతనే పత్తి విత్తనాలు విత్తుకోవాలి. లేదంటే గింజల వేర్లు భూమిలోకి వెళ్లకుండా భూమి పైన ఉండలుగా చుట్టుకొని ఉంటాయి. రైతులు పెద్ద వర్షాలు కురిసిన తర్వాతనే పత్తి విత్తనాలు నాటు కోవడం మంచిది. మీరు వీలుంటే నీటిని అందించే ఏర్పాటు చేసుకోండి.

రైతు: ఈ ఏడాది మామిడి చెట్ల పూత రాలింది. దిగుబడి తగ్గింది. సుమారు 100 మంది మామిడి రైతులమున్నాం. నివారణ మార్గాలు తెలపండి?

(గంగుల రవి, తాడిచెర్ల, మల్హర్)

డీఏఓ: జిల్లాలో 460 ఎకరాలు మామిడి సాగవుతోంది. మీ మండలంలోని మామిడి రైతులు ఫోన్‌లో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయండి. జిల్లాలోని మిగతా రైతులను, ఆర్టీకల్చర్ అధికారులు ఆ గ్రూపులో కలుపుతారు. ఎక్కడ ఏ సమస్య వచ్చిన నివారణకు పరిష్కారం చేసుకునేందుకు వీలుంటుంది.

రైతు: భూమి చౌడు నేలగా మారింది. ట్రాక్టర్లు పొలంలో దిగబడుతున్నాయి, ప్రతీ ఏడాది వరి పంటకు (గెనె) వేరుకుళ్లు తెగులు వ్యాపిస్తుంది. నివారణ మార్గాలు తెలపండి?

(నంది విజయ్‌కుమార్, కొత్తపల్లిగోరి)

డీఏఓ: భూమి మట్టి నమూనాలను వ్యవసాయ అధికారులకు ఇవ్వండి. పరీక్ష చేయించి పాల చౌడ, ఉప్పు చౌడ వివరాలు చెబుతాం. అనంతరం పలు సలహాలు పాటిస్తే భూమి పూర్వవైభవం సంతరించుకుంటుంది. గెనె తెగుళ్లు సోకకుండా మిర్చి నారు మళ్లకు, 3జీ, 4జీ గులికలు వేస్తే తెగుళ్లు రాకుండా ఉంటుంది.

రైతు: ఎలాంటి భూముల్లో పత్తి సాగుకు అనుకూలం?

(పెంచాల మల్లయ్య, తాడిచెర్ల, మల్హర్)

డీఏఓ: ఎలాంటి భూముల్లోనైనా పత్తి సాగుచేయవచ్చు. సాగు నీరు అందుబాటులో లేనట్లయితే తేలికపాటి తక్కువ రోజుల్లో అంటే 40 నుంచి 50 రోజుల్లో పూతకు వచ్చే విత్తనాలు విత్తుకోవాలి. దీంతో రైతులకు లాభం చేకూరుతుంది. గతేడాది 3,400 ఎకరాల్లో తక్కువ నీటితో సాగయ్యే ఏ పత్తి పంటను సాగు చేశారు. రైతులు లాభాలు పొందారు.

రైతు: గతేడాది పత్తి సాగు చేశాం. దిగుబడి ఆశించినంత రాలేదు. ఎలాంటి చర్యలు చేపట్టాలి?

(బానోతు రాజేందర్, రామన్నగూడెం తండా, భూపాలపల్లి)

డీఏఓ: మంచి దిగుబడి వచ్చే పత్తి విత్తనాలు విత్తుకోవాలి. సాలుకు సాలుకు మధ్య మూడు ఫీట్లు ఉండాలి. మొక్కకు, మొక్కకు మధ్య 2 ఫీట్లు ఉండే విధంగా ఎకరాకు సుమారుగా 8 వేల మొక్కలు నాటుకోవాలి. సరైనా యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి పెరుగుతుంది.

రైతు: మంచి దిగుబడి వచ్చే విత్తన రకాలు తెలపండి.

(గజ్జి రాజ్ కుమార్, మొట్లపల్లి, మొగుళ్లపల్లి)

డీఏఓ: నీటి వనరులున్న చోట వ్యవసాయ పద్ధతుల ప్రకారం పంటలను సాగు చేస్తే పంట దిగుబడి ఆశించినంత వస్తుంది. నీటి వనరులున్నచోట కునారం రకం వంగడాలైన ఎంటీయూ 1271 రకం 145 రోజులు, ఎంటీయూ 1224 రకం 135 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది.

రైతు : మిర్చికి ప్రతి ఏటా వేరుకుళ్లు తెగులు వస్తుంది. నివారణ మార్గాలు తెలపండి?

(అన్నారపు రాజేందర్, పోచంపల్లి, రేగొండ)

డీఏఓ: ఆగస్టులో రెండు, మూడవ వారంలో మిర్చి మొక్కలు నాటుతారు. దానికి ముందు జూన్‌లో మొదటి వాన పడిన తర్వాత పెసరును వేసి ఆగస్టు నెలలో పెరిగిన పెసరలో ఎకరానికి 2 బస్తాల సూపర్ ఫాస్పేట్‌ను కలిపి చెనులోనే దున్నాలి. దీంతో ప్రమాదకరమైన శిలింద్రాలు నాశనమవుతాయి. మిర్చి పంటలకు తెగుళ్లు రాకుండా ఉంటుంది.

రైతు: పత్తి చేన్లు తెగుళ్లతో మాడిపోతున్నాయి. పంట మార్పిడి చేసినా ఫలితం లేదు?

(ఇప్పాల సురేందర్, మొగుళ్లపల్లి)

డీఏఓ: బోజ తోలిన తర్వాత పత్తి మొక్కలను బోజ కాల్వలో కాకుండా మధ్యలో నాటాలి. దీంతో మొక్కకు నీరు నిల్వకుండా ఉంటుంది. ట్రికోర్మవిరిడి అనే మందు ఉంటుంది. దానిని పశువుల ఎరువుతో కలిపి పత్తి మొక్క మొదట్లో వేసినట్లయితే ఫలితం ఉంటుంది.

రైతు: నకిలీ విత్తనాలను అరికట్టాలి.

(లక్ష్మీనారాయణ దామెరకుంట, కాటారం)

డీఏఓ: ఇటీవల కాలంలో నకిలీ విత్తనాలపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోంది. విత్తనాలు కొనుగోలు చేసిన వారు రశీదు తీసుకోవాలి. ఏ షాపు వారైన రశీదు ఇవ్వనట్లయితే షాపులను సీజ్ చేసి తగిన చర్యలు తీసుకుంటాం. రైతులు సమాచారం ఉంటే తెలపాలి.

రైతు: యాసంగిలో దిగుబడి తగ్గింది. అవగాహన కల్పించాలి?

(సోమిశెట్టి మహేష్, ఆజాంనగర్ భూపాలపల్లి)

డీఏఓ: గ్రామాల్లో మంగళవారం, శుక్రవారం రోజున రైతు వేదికల్లో అవగాహన కల్పిస్తున్నాం. వరిలో ఈక పురుగుతో పంటలకు నష్టం వచ్చింది. గ్రామాల్లోకి అధికారులు వచ్చినప్పుడు రైతులు ఎక్కువ సంఖ్యలో రావడంలేదు. అందరిని ఒక దగ్గరికి తీసుకువచ్చే ప్రయత్నం చేద్దాం, మీలాంటి యువరైతుల సహకారాన్ని తీసుకుంటాం. మీ గ్రామంలోని రైతులు సమావేశం ఏర్పాటు చేసి సమాచారం ఇస్తే సమావేశానికి హాజరై అవగాహన కల్పిస్తాం.

బడీడు పిల్లలు బడిలో ఉండాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాం రెడ్డి



మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి రూరల్: బడీడు పిల్లలు బడిలో ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జయరాం రెడ్డి అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్ని కష్టాలు వచ్చినా పిల్లలు చదువును మధ్యలో ఆపకూడదన్నారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ప్రారంభం అయినప్పటి నుంచి బాల కార్మికులు చాలా వరకు తగ్గారని, పూర్తి స్థాయిలో ఆ వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. విద్య సంవత్సరం ప్రారంభమైనా వేళ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే కార్యక్రమం వేగంగా జరిగేవిధంగా అధికారులు, ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరి సురేష్ కుమార్, కార్యదర్శి బల్లా మహేందర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెరుగు రవీందర్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కంప అక్షయ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రియాంక, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి ప్రసన్న, న్యాయవాదులు వేషాల అనిల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ములుగులో..

ములుగు: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్‌వీపీ. సూర్య చంద్రకళ, కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు హాల్‌లో బాలకార్మిక వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకార్మిక నిరోధక చట్టంపై వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ వెల్ఫేర్ అధికారి స్వర్ణలత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినోద, డీసీపీఓ ఓంకార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ భవేష్‌మిశ్రా



పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ భవేష్‌మిశ్రా

గణపురం: విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. బుధవారం గణపురం మండలంలోని మైలారం గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్ల నిర్మాణం, హ్యాండ్‌వాష్ ప్లాట్ ఫాం నిర్మించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అధికంగా చేరేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, బడిఈడు పిల్లలు ఎవరు బయట తిరగకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీఈఓ రాంకుమార్, డీఆర్డీఓ నరేష్, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొనసాగుతున్న వైద్య సేవల గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మారుమూల మండలాలైన పలిమెల, మహముత్తారం, కాటారం మండలాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్, అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మాతా శిశు మరణాలు, చిన్న పిల్లల్లో వచ్చే రక్తహీనత సమస్యలు, టీబి, అంటు వ్యాధుల నిర్మూలన కార్యక్రమాలు జరిగే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ ఆరోగ్యం, జాతీయ ప్రమాణాల ఆరోగ్య నివేదిక గురించి సమీక్షించారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. సరియైన సదుపాయాలు లేని పీహెచ్‌సీలకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరగా స్పందించి మొగుళ్లపల్లి, అంబట్‌పల్లి పీహెచ్‌సీల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వర్షాకాలంలో అన్ని గ్రామాలలో క్షేత్ర పరిశీలన కొరకు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మెడికల్ ఆఫీసర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తామన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజుడేవిడ్, సీహెచ్‌సీల సూపరింటెండెంట్‌లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

టేకుమట్ల: టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగు వంతెనపై కొనసాగుతున్న పునఃనిర్మాణ పనులను బుధవారం కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు ఎప్పటి వరకు కొనసాగుతాయి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా అని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రవాణా సౌకర్యార్థం కొనసాగుతున్న మట్టి రోడ్డును పరిశీలించారు. వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో వీలైనంత త్వరగా వంతెన పునఃనిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ ఇంటింటి సర్వేలో భాగంగా స్వయంగా సర్వే నిర్వహించారు. ఆయన వెంట ఆర్ అండ్‌బీ ఎస్ఈ, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ గౌడ సురేష్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

'డబుల్' ఇళ్ల వద్ద నిరసన



డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్ గడ్డ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులు బుధవారం నిరసన చేపట్టారు. 8నెలల క్రితం డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేసేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారని, కానీ ఇప్పటి వరకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించే విషయం తెలుసుకున్న లబ్ధిదారులు అక్కడికి చేరుకుని కలెక్టర్, ఎమ్మెల్యే ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టాలని చూశామని, కానీ కలెక్టర్ రాకపోవడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటికైన 'డబుల్' ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

బదిలీల ప్రక్రియ సజావుగా చేపట్టాలి

ములుగు రూరల్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ సజావుగా చేపట్టాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా సెక్రటరీ అజ్మీరా రాజునాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం డీఈఓ పాణిని కలిసి ఆయన మాట్లాడారు. అపోహలకు తావులేకుండా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. ఉద్యోగులకు ఎలాంటి సందేహాలు లేకుండా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు.. పీఎస్ హెచ్ఎం పోస్టుల్లో డీఈడీ వారికి కూడా అవకాశం కల్పించాలని తెలిపారు. పీఎస్ హెచ్ఎం పదోన్నతులను ఉపాధ్యాయులందరికీ వర్తించేలా జీఓ జారీ చేయాలని కోరారు.

కౌన్సిల్ మీటింగ్ బహిష్కరణ

- కమిషనర్ అహంకారంతో వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- పలు శాఖల అధికారుల గైర్హాజరుపై కౌన్సిలర్ల ఆగ్రహం



కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

భూపాలపల్లి: మున్సిపాలిటీ సమావేశాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు బహిష్కరించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు అధ్యక్షతన బుధవారం ఉదయం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే పలువురు కౌన్సిలర్లు పట్టణంలోని సమస్యలను లేవనెత్తారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాసేపు చర్చించారు. కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉందని, ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని వాపోయారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ కార్యాలయానికే పరిమితం అవుతున్నాడని, పట్టణంలో పర్యటించడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలో కమిషనర్, కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం నెలకొనడంతో సమావేశాన్ని బైకాట్ చేస్తున్నట్లు అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు ప్రకటించారు. కౌన్సిల్ హాల్ నుంచి బయటకు వచ్చిన కౌన్సిలర్లు విలేకరులతో మాట్లాడుతూ.. కమిషనర్ పనితీరు మూలంగా పట్టణంలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి కౌన్సిలర్లు బైకాట్ చేయడానికి గల కారణాలను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. కాగా మిషన్ భగీరథ అధికారులు, తహసీల్దార్, సింగరేణి, ఆర్టీసీ, ఎక్సైజ్, విద్యాశాఖ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు కౌన్సిల్ సమావేశానికి హాజరు కానందున కౌన్సిల్ సభ్యుల కోరిక మేరకు సమావేశం వాయిదా వేసినట్లు కమిషనర్ టి.రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో వైస్‌చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

వెంకటాపురం(కె): విద్యార్థులకు సరైన వసతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీఎల్.రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వంశీ అధ్యక్షతన బుధవారం ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేకుల షెడ్డులలో పాఠశాలలు నిర్వహించడం వల్ల గాలి, దుమ్ముకు, వర్షాలకు ఏ సమయంలోనైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. సరైన బాత్ రూమ్ సౌకర్యాలు కూడా లేవన్నారు. పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లను సైతం నియమించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, మోహన్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'భీమునిపాదం'లో రైతుల పూజలు



జలపాతం వద్ద పూజలు చేస్తున్న రైతులు

గూడూరు : మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలోని భీమునిపాదం జలపాతం తొలకరి వర్షాలకు జాలువారడం ప్రారంభించింది. మృగశిర కార్తె ప్రారంభమైన నేపథ్యంలో రెండు రోజుల నుంచి చిరు జల్లులు కురుస్తుడడంతో ఎత్తైన గుట్టల నుంచి వస్తున్న నీరు భీమునిపాద జల పాతం గుండా జాలువారడం ప్రారంభమైంది. కాగా, భీమునిపాద జలపాతం నీరు సమీప భీమునిపాదం చెరువులోకి చేరుతుంది. దీంతో ఆ చెరువు ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకుంటారు. తొలకరి వర్షాలతో జలపాతం జాలువారడం గుర్తించిన కొమ్ములవంచ గ్రామ రైతులు బుధవారం జలపాతం వద్దకు చేరుకున్నారు. ముందు స్నానం చేసి పక్కన ఉన్న శివుడు, నాగరాజు, పావనచ్చమ్మ విగ్రహాలను అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ జల పాతం నీటితో భీమునిపాదం చెరువు నిండి పంటలు సమృద్ధిగా పండుతాయని రైతులు మైదం వెంకన్న, మద్ది నర్సయ్య, ఆలుగడ్డ భిక్షం, రాజాలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

- కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా రాజ్‌కుమార్



రాజ్‌కుమార్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న మల్లారెడ్డి, పక్కన అధ్యాపకులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల డైరెక్టర్‌గా గణితశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పి. రాజ్‌కుమార్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. హాస్టళ్ల డైరెక్టర్‌గా ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఇటీవల రాజీనామా చేయగా, ఆయన స్థానంలో రాజ్‌కుమార్‌ను నియమించారు. ఈమేరకు బుధవారం సమ్మయ్య నుంచి రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాజ్‌కుమార్‌ను కేయూ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, అధ్యాపకులు, హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్లు అభినందించారు.

అంతిమయాత్రలో తేనెటీగల దాడి



తేనెటీగల దాడితో మృతదేహాన్ని రోడ్డుపై వదిలి పారిపోయిన బంధువులు

కొత్తగూడ: అంతిమయాత్ర చేస్తున్న వారిపై తేనెటీగలు దాడి చేసిన ఘటన బుధవారం కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రుద్రారపు వీరస్వామి(70) అనారోగ్యంతో మృతి చెందాడు. వీరస్వామి అంతిమయాత్ర చేస్తున్న క్రమంలో టపాసులు కాల్చారు. ఆ శబ్దానికి ఓ చెట్టుపై ఉన్న తేనె టీగలు చెదిరి అంతిమయాత్రలో పాల్గొన్న వారిని కుట్టసాగాయి. దీంతో మృతదేహాన్ని రోడ్డుపై వదిలేసి బంధువులు పరుగులు తీశారు. తేనెటీగలు కుట్టిన వారిని 108లో నర్సంపేట ఆసుపత్రికి తరలించారు. చీకటి పడిన అనంతరం కొందరు.. వీరస్వామి దహన సంస్కారాలు నిర్వహించారు.



ఎల్‌ఆర్‌ఎస్..ఎందాకా..?

నాలుగేళ్లుగా పెండింగ్‌లో దరఖాస్తులు
- అత్యధికంగా 'గ్రేటర్'లో 99,297.. వర్ధన్నపేటలో 522..
- లేఅవుట్ల క్రమబద్ధీకరణపై డిప్యూటీ సీఎం సానుకూల ప్రకటన
- దరఖాస్తులకు కదలిక.. అధికారిక ఉత్తర్వుల కోసం వెయిటింగ్



సాక్షిప్రతినిధి, వరంగల్: అనధికార ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించింది. ఈ పథకంతో ప్రభుత్వానికి ఆదాయంతోపాటు, కొనుగోలుదారుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఈ అవకాశం కల్పించింది. 2020 ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఆన్‌లైన్ ద్వారా ఒక్కో స్థలానికి రూ.1,000, వెంచర్లకు రూ.10 వేల చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి వరంగల్‌లోని 9 మున్సిపాలిటీల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఏడాదికి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ - 2020 దరఖాస్తులను పరిశీలించి అనుమతి ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాలు ఆగిపోయాయి. దీంతో నాలుగేళ్లుగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. అనధికార లేఅవుట్ స్థలాల క్రమబద్ధీకరణపై ఈ నెల 7న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఇప్పటికైనా ఆ దరఖాస్తుల్లో కదలిక వస్తుందా? అన్న చర్చ జరుగుతోంది.

నాలుగేళ్లుగా పెండింగ్‌లో దరఖాస్తులు..

దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టి నాలుగేళ్లవుతోంది. ఎల్‌ఆర్‌ఎస్‌కు వచ్చిన దరఖాస్తుల్లో దరఖాస్తుదారు మరొకరికి విక్రయించిన ప్లాట్లు, ప్రభుత్వ భూములు, నిషేధిత జాబితాలోనివి, ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చేవి మినహాయించి, మిగిలిన వాటిని పరిశీలించి పరిష్కారానికి సిద్ధం చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలో వరంగల్ కార్పొరేషన్, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట పురపాలికలున్నాయి. వీటి పరిధిలో 1,56,078 ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు అందినట్లు సమాచారం. దరఖాస్తుదారులు రూ.15 కోట్లకుపైగా ప్రాథమిక రుసుం చెల్లించారు. వీటిలో 10,082 దరఖాస్తులను పరిశీలించినట్లు అప్పట్లో ప్రకటించిన అధికారులు.. ఆ మేరకు అనుమతులు ఇవ్వలేదు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు 2020లో ఆయా పురపాలికల పరిధిలో ఉన్న రిజిస్ట్రేషన్ విలువల ఆధారంగా రుసుం వసూలు చేసి ప్రాసెస్ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. తద్వారా ఉమ్మడి వరంగల్‌లో రూ.405 నుంచి రూ.430 కోట్ల ఆదాయం ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈప్రక్రియ అంతా ఆగిపోగా.. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతోనైనా దరఖాస్తులు పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలని అధికారులను దరఖాస్తుదారులు కోరుతున్నారు.

"అనధికారిక ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్)పై అధికారులు వెంటనే దృష్టి సారించాలి. అందుకు సంబంధించిన సమాచారం సేకరించి పెండింగ్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి."

ఈ నెల 7న అధికారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు.

కార్పొరేషన్/మున్సిపాలిటీల వారీగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు...

జిల్లా	మున్సిపాలిటీ	ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు	పరిశీలించిన దరఖాస్తులు
గ్రేటర్‌వరంగల్	కార్పొరేషన్	99,297	7,049
హనుమకొండ	పరకాల	3,182	549
వరంగల్	నర్సంపేట	5,316	77
	వర్ధన్నపేట	522	149
మహబూబాబాద్	మహబూబాబాద్	12,191	932
	డోర్నకల్	872	212
	మరిపెడ	2,598	03
	తొర్రూరు	10,239	141
జేఎస్ భూపాలపల్లి	భూపాలపల్లి	3,486	254
జనగామ	జనగామ	18,375	716

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసినా..



నాన్ లే అవుట్ ప్లాటు క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) కోసం నేను 2020 అక్టోబర్‌లో ఆన్‌లైన్‌లో ప్లాటు వివరాలను నమోదు చేసి రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నా. క్రమబద్ధీకరణ త్వరగా చేయాలని రెండేళ్లుగా బల్దియా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ఏడాది క్రితం బల్దియా అధికారులు దరఖాస్తులను పరిశీలించి ఫీల్డ్ మీద ప్లాటును సందర్శించి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఎల్‌ఆర్‌ఎస్ విధానంపై పురోగతి లేదు.

- మంద సంతోష్, రామన్నపేట వరంగల్

అనుమతులు ఇవ్వాలి



నేను ఖిలా వరంగల్ గ్రామ శివారు దూపకుంటరోడ్డు 891 సర్వేనంబర్‌లో 2012లో 200 గజాల ప్లాటు కొనుగోలు చేశా. ప్లాటు క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) కోసం రూ.1000 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకున్నా. అనుమతి ఇవ్వాలని రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. 2023 ఫిబ్రవరిలో బల్దియా అధికారులు స్థలాన్ని పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫీజు వివరాలు చెప్పలేదు. నాలుగేళ్లు కావొస్తున్నా దరఖాస్తు పెండింగ్‌లో ఉంది.

- సామల నిరంజన్, శివనగర్ వరంగల్

ఉత్తర్వులు రాగానే క్లియర్ చేస్తాం

వరంగల్ మహా నగరంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 99,297 దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది అక్టోబర్ నాటికి 10వేల వరకు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ల్యాండ్, డ్యాకుమెంట్ వెరిఫికేషన్, అప్‌లోడ్ ప్రక్రియ పూర్తయ్యింది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ఇప్పటికే అప్‌లోడ్ చేసిన దరఖాస్తుల ఫీజుల చెల్లింపునకు అవకాశం కల్పిస్తూ, ప్రొసీడింగ్‌లు జారీ చేస్తాం. మిగిలిన దరఖాస్తులను వెరిఫికేషన్ చేస్తాం.

- వెంకన్న, సిటీ ప్లానర్, గ్రేటర్ వరంగల్

నిజామాబాద్‌కు డీలక్స్ బస్ సౌకర్యం



వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత

హన్మకొండ: వరంగల్ నుంచి నిజామాబాద్‌కు డీలక్స్ బస్ సౌకర్యం కల్పించినట్లు టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత తెలిపారు. ఇప్పటి వరకు ఎక్స్‌ప్రెస్ బస్ సౌకర్యం మాత్రమే ఉందని, ప్రయాణికులకు మరింత సుఖవంత ప్రయాణం అందించేందుకు డీలక్స్ బస్ నడుపుతున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి హనుమకొండ మీదుగా 12 డీలక్స్ బస్‌లు నడుపుతున్నట్లు వివరించారు. రోజూ ఉదయం 4.15 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతి 10 నిమిషాలకు ఒకటి చొప్పున డీలక్స్ బస్ బయలుదేరుతుందన్నారు. రాత్రి 8 గంటల తర్వాత రాత్రి 11 గంటల వరకు ప్రతి అరగంటకు ఒక బస్ ఉంటుందని తెలిపారు. వరంగల్ నుంచి 4.15, 6.00 ,6.45, 7.30, 8.00, 8.30, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 డీలక్స్ బస్ బయలు దేరుతుందని వివరించారు. నిజామాబాద్ నుంచి 6.00, 6.45, 7.30, 8.00, 8.30, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 డీలక్స్ బస్‌లు బయలుదేరుతాయన్నారు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు చార్జీ రూ.350, హనుమకొండ నుంచి నిజామాబాద్‌కు రూ.340, కరీంనగర్ నుంచి నిజామాబాద్‌కు రూ.230, హనుమకొండ నుంచి కరీంనగర్‌కు రూ.120 నిర్ణయించినట్లు వివరించారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌డీఎల్‌సీఈ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి ప్రారంభం.. 13 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 11, 279మంది విద్యార్థులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఎస్‌డీఎల్‌సీఈ డిగ్రీ బీఏ, బీకాం కంప్యూటర్ జనరల్ అండ్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ ప్రథమ, ద్వితీయ ,ఫైనల్ ఇయర్ ఎక్స్ అభ్యర్థులకు (ఇయర్‌వైజ్ స్కీం) పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్ నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ నరేందర్ బుధవారం తెలిపారు. ఈనెల 13న (నేడు) ఫైనల్ ఇయర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. ఈనెల 13,19,25,28, జూలై 2,5,9,13వ తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి మధ్యాహ్నం 5గంటల వరకు జరుగుతాయి. డిగ్రీ సెకండియర్ పరీక్షలు ఈనెల 14, 20, 26, 29, జూలై 3, 6, 10వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. డిగ్రీ ఫస్టియర్ పరీక్షలు ఈనెల 18, 21, 27, జూలై 1, 4, 8, 11వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. డిగ్రీ ఫస్టియర్, సెకండియర్, ఫైనల్ ఇయర్ కలిపి మొత్తం 11,279 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌తోపాటు నల్లగొండ జిల్లాలో కలిపి మొత్తం 13 పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

అందరం కలిసికట్టుగా పనిచేద్దాం

- ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేసుకుందాం
- ఎంపీ కావ్య సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

మడికొండ: అందరం కలిసి కట్టుగా పని చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం కాజీపేట మండలం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిచయం, ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడారు. అధికారం ఎప్పుడు శాశ్వతం కాదని, అధికారం ఉందని అహంకారం ప్రదర్శించొద్దన్నారు. అవినీతి, అహంకారం వల్లే ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్య గెలుపునకు కృషి చేసిన శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కడియం శ్రీహరి మంచితనం.. తనపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించిన కాంగ్రెస్ కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. ఎంపీ నిధులతో నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, నగర మేయర్ గుండు సుధారాణి, సింగరావు ఇందిర, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కూచన రవళి, నమిండ్ల శ్రీనివాస్, సాంబయ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కత్తి వెంకటస్వామి, స్థానిక నాయకులు బిల్ల రవీందర్, గుర్రం అమర్‌నాథ్, వస్కుల భాస్కర్, శంకర్, లింగమూర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందజేయాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



పనులను పరిశీలిస్తున్న వరుణ్ రెడ్డి

రేగొండ(కొత్తపల్లిగోరి)/ చిట్యాల : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందజేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. బుధవారం కొత్తపల్లిగోరి మండలంలోని చెన్నాపూర్, చిట్యాల మండలంలోని నైన్‌పాక గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ల పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ల ఏర్పాటు వల్ల వినియోగదారులకు లో వోల్టేజీ సమస్య తీరి నాణ్యమైన విద్యుత్ అందడంతో పాటు, అంతరాయాలు తగ్గుతాయన్నారు. కొత్తగా నిర్మాణం చేపట్టబోతున్న ఒడితల సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. కొత్తగా కనెక్షన్ తీసుకునే వ్యవసాయ వినియోగదారులకు కూడా యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి సర్వీసులను రిలీజ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్సూర్ నాయక్, డివిజనల్ ఇంజనీర్ నాగరాజు,కన్‌స్ట్రక్షన్ అండ్ ఎంఆర్టీ డివిజనల్ ఇంజనీర్ సదానందం, రేగొండ ఏఈ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రతకు పెప్‌టాక్..

పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై యాజమాన్యం ఆందోళన
- నివారణకు ప్రత్యేక చర్యలు
- రోజూ ఉద్యోగులకు భద్రతా సూచనలు, ప్రతిజ్ఞ
- ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో అమల్లోకి కార్యాచరణ



యాదవనగర్ సెక్షన్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

హన్మకొండ: రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాల నివారణకు టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. ఇందులోభాగంగా ఈ నెల 10వ తేదీన సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఎన్పీడీసీఎల్ పరిధిలోని సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలకు ప్రధాన కార్యాలయంలోని ఆపరేషన్ సీజీఎం-1, సీజీఎం-2 కలిపి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని, మనుషులు, జంతువులు, పశువులు మృత్యువాత పడుతున్న ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ వీటిని నివారించాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. ఇవి తప్పుడు లైన్ క్లియర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ లోపం, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లు, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల స్నాపింగ్‌లు వంటి అంశాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రాణాలు పోతున్నాయని పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించడంతోనే ప్రమాదాలు నివారించొచ్చని యాజమాన్యం, సీఎండీ వరుణ్ రెడ్డి సూచించారు.


ఉద్యోగుల్లో ఉత్సాహం, ఉత్తేజం నిండేలా ప్రసంగం

ప్రమాదాల నివారణ, భద్రతకు సంబంధించిన సందేశాలను స్పష్టంగా క్రమం తప్పకుండా కమ్యూనికేట్ చేయడానికి ప్రతి రోజు, ప్రతి సెక్షన్, ప్రతి సబ్ స్టేషన్‌లో పెప్ టాక్ నిర్వహించాలని సీఎండీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం నుంచి డీఈలు, ఏడీఈలు, ఏఈలు సెక్షన్ వారీగా సిబ్బందితో సమావేశాలు నిర్వహించి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగనుంది. ఆపరేషన్ డీఈలు, డీఈ (టెక్), ఏడీఈ, ఏడీఏ (టెక్)లను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. వీరి పర్యవేక్షణలో పెప్ టాక్ జరుగుతుంది. పెప్ టాక్ అనగా చిన్న ప్రసంగం. ఈ ప్రసంగం ద్వారా అధికారులు ఉద్యోగుల్లో ఉత్సాహం, ఉత్తేజం నింపుతారు. భద్రతా ప్రమాణాలను రోజూ గుర్తు చేస్తారు. ఇది ఒక రకంగా రోజూ తాజా ప్రమాణాలతో శిక్షణ ఇవ్వడమే. విధుల్లోకి వెళ్లే ఉద్యోగులు వ్యక్తిగత భద్రతా పరికరాలు (పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్) వెంట ఉండేలా గుర్తు చేస్తారు. రోజూ తాము భద్రతా ప్రమాణాలు పాటిస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తారు. అదే విధంగా ఉద్యోగులు అజాగ్రత్తగా వ్యవహరించకుండా పని ప్రదేశం, బ్రేక్ డౌన్లు, మరమ్మతులు, నిర్వహణ సమయంలో నోడల్ అధికారులు తనిఖీ నిర్వహిస్తారు. అవసరమైతే పని ప్రదేశాన్ని అధికారులు క్షేత్ర స్థాయిలో ముందుగా పరిశీలించి వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారు. సెక్షన్‌లో అత్యవసరంగా అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకోవడం కూడా ఇందులో ఒక భాగం. ఉద్యోగులు ఎర్త్ డిశ్చార్జి రాడ్ వెంట ఉంచుకునేలా చర్యలు తీసుకుంటారు. సబ్ స్టేషన్‌లో హ్యాండ్ గ్లౌజ్, హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకుంటారు. ఈ మేరకు 3 ఫీట్ల హెల్త్ డిశ్చార్జి రాడ్, హ్యాండ్ గ్లౌజ్‌లను పంపిణీ చేశారు. అయితే హెల్మెట్ల కొరత ఉంది.

సమీక్షలో ఇదేం వివక్ష

- మహిళా అధికారులను అవమానించేలా వ్యాఖ్యలు
- హనుమకొండ సర్కిల్‌లోని ఓ డివిజన్ స్థాయి అధికారి వింతపోకడలు





హన్మకొండ : విద్యుత్ శాఖలో ప్రగతిపై ప్రతి నెల నిర్వహించే సమీక్ష సమావేశాలు కొంత మంది అధికారుల తీరుతో అభాసుపాలవుతున్నాయనే ఆరోపణలున్నాయి. సొంత సంస్థలో పనిచేసే కిందిస్థాయి అధికారులతో పైస్థాయి అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో వారు చిన్నబుచ్చుకుంటున్నారు. పై స్థాయి అధికారి కావడంతో కిమ్మనకుండా ఉంటున్నారు. ఈ డివిజన్ అధికారికి ఎవరైనా అభ్యంతరం తెలిపేందుకు ప్రయత్నిస్తే వారిపై వివక్ష చూపుతాడనే ప్రచారం విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. హనుమకొండ సర్కిల్ పరిధిలోని ఓ డివిజన్ స్థాయి అధికారి తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. రెండు రోజుల క్రితం నిర్వహించిన డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో ఓ సెక్షన్ స్థాయి మహిళాఅధికారిని రాత్రి నిద్ర పోలేదా? కండ్లు ఎందుకు ఎర్రబడ్డాయి... అంటూ ద్వంద్వార్థాలు వచ్చేలా ఆ డివిజన్ అధికారి మాట్లాడారనే ప్రచారం ఎన్పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఓ మహిళా అధికారి పట్ల ఈ విధంగా ఎలా మాట్లాడుతారని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఇదే సమావేశంలో ఓ ఏఈ బాగా పని చేస్తున్నాడని అభినందిస్తూ చప్పట్లు కొట్టించగా, అదే సమావేశంలో పాల్గొన్న మరో ఏఈ బాగా పని చేసే వారికి కాకుండా వేరే ఏఈకి ఉత్తమ అధికారిగా ఎలా ఎంపిక చేస్తారని అడిగితే ఆ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశాడని చర్చించుకుంటున్నారు. తానొక నాయకుడిని తనకు ఎదురేముంది అనే తీరుతో వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా సదరు అధికారి కార్యాలయంలో ఉంటే అక్కడికి వెళ్లేందుకు డివిజన్ పరిధిలోని ఆయా సెక్షన్‌లు, ఈఆర్‌ఓలో పని చేసే ఉద్యోగులు భయపడుతున్నారు. ఆయన లేని సమయం చూసి కార్యాలయానికి వచ్చి వారి పనులు చేయించుకుంటున్నారు.

అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య

- మద్దులపల్లిలో ఘటన



చెంద్రు మృతదేహం

కాటారం: పంట సాగు కోసం చేసిన అప్పు ఓ కౌలు రైతు ప్రాణాన్ని బలిగొంది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మద్దులపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దులపల్లికి చెందిన గడ్డం చెంద్రు(34) నాలుగు సంవత్సరాలుగా 8 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాడు. రెండేళ్ల అధిక వర్షాల కారణంగా పత్తి సాగులో తీవ్ర నష్టం వాటిల్లి రూ.6 లక్షల మేర అప్పు అయ్యింది. ఈ అప్పు తీర్చేందుకు గతేడాది అదే భూమిలో పత్తి సాగు చేయగా వాతావరణం అనుకూలించక దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ఉన్నదానికి మరో రూ.4 లక్షలు పెరిగింది. మొత్తం రూ.10లక్షల అప్పు ఎలా తీర్చాలని తీవ్ర మనోవేదనకు గురైన చంద్రు ఈ నెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు. చెంద్రు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కుమార్తెలు శ్రీకన్య, నగ్మా, కుమారుడు అభిరానందన్ ఉన్నారు. ఈ ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

దాడికి పాల్పడ్డారని మహిళ ఆత్మహత్యాయత్నం

కురవి : లైంగిక వేధింపులకు గురిచేయడంతోపాటు ఇంటిపైకి వచ్చి దాడి చేయడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ.. ఈ నెల 9వ తేదీన మందు గోళీలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు జాటోత్ శాలిని కథనం ప్రకారం.. కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్య తండాకు చెందిన జాటోత్ శాలిని ఈనెల 8వ తేదీన ఇంటి ముందు ఉండగా అదే తండాకు చెందిన బానోత్ నాగేశ్.. లైంగిక వేధింపులకు గురిచేశాడు. అదే విధంగా ఈనెల 9వ తేదీన భూమి పంచాయితీ విషయమై తండాకు చెందిన నాగేశ్, సోన, వినయ్‌తోపాటు మరికొందరు శాలిని ఇంటిపైకి వచ్చి దాడి చేసి కొట్టారు. దీంతో లైంగికంగా వేధించడంతోపాటు దాడి చేయడంతో మనస్తాపానికి గురైన శాలిని మందు గోళీలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే అదేరోజు మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఈ విషయమై కురవి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో మంగళవారం ఎస్పీకి ఫిర్యాదు చేసింది. తనను వేధించడంతోపాటు దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకుంది.

ఒడిశా టు ముంబై..

- రైలులో గంజాయి తరలింపు
- యువతి అరెస్ట్.. 57 కిలోల సరుకు స్వాధీనం



పట్టుబడిన గంజాయి బ్యాగులు చూపుతున్న పోలీసులు

గార్ల: ఒడిశా నుంచి రైలులో ముంబై తరలిస్తున్న రూ.20 లక్షల విలువైన 57 కిలోల గంజాయిని పోలీసులు బుధవారం రాత్రి గార్ల రైల్వేస్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. ఎస్సై ఎన్ జీనత్‌కుమార్ కథనం ప్రకారం.. ఒడిశాలోని గాజుపాటి జిల్లా రాకేశ్‌పంగ గ్రామానికి చెందిన యువతి లల్లికి తన పిన్ని 57 కేజీల గంజాయిని 3 సూట్ కేసుల్లో పెట్టి అప్పగించి ముంబైలోని ఓ వ్యక్తికి ఇచ్చి రమ్మని పంపించింది. దీంతో లల్లి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 3 సూట్ కేసుల్లో గంజాయి తీసుకొస్తోంది. ఈ క్రమంలో పోలీసులు రైలులో తనిఖీలు చేస్తున్నారు. సిగ్నల్ ఇవ్వకపోవడంతో గార్లలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచింది. దీంతో పోలీసులకు పట్టుబడుతానేమో అనే భయంతో లల్లి 3 సూట్‌కేస్‌లు రైలు నుంచి కిందపడేసి గార్లలో దిగింది. రాత్రి సమయంలో రైల్వేస్టేషన్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు అనుమానం వచ్చి సూట్‌కేసులను తనిఖీ చేసి తెరవగా గంజాయి కనిపించింది. దీంతో లల్లిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయికి సంబంధించిన వివరాలు వెల్లడించింది. ఈమేరకు గంజాయి స్వాధీనం చేసుకుని లల్లిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్ జీనత్‌కుమార్ తెలిపారు.